క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన నాగోజు ఆచారి (65) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం మాజీ సర్పంచ్ స్వప్నా భాస్కర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 3000 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, రమేష్‌నాయక్, రాములు, బుచ్చిరెడ్డి, షేక్ బాబా, చంద్యనాయక్, నర్సింహ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శ్రీనివాసమూర్తి శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిషేకం, పుష్పార్చనాది తదితర విశేష పూజలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏఓ



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఆమనగల్ మండలం ఆకుతోటపల్లిలో ఉన్న పలు ఫర్టిలైజర్ షాపులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, షాప్‌లో ఉన్న నిల్వలను ఆమె పరిశీలించారు. ఎరువుల షాపుల యజమానులు ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వానాకాలం సీజన్లో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నేడు

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నిమిషాలకు సదస్సు ప్రారంభమవుతుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లికి చెందిన రైతు ఈర్లపల్లి లాలయ్యకు చెందిన గడ్డివాము సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సుమారు రూ.40వేల విలువ గడ్డి కాలిపోయిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నాడు.

రేపు లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి, కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 7:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గౌరెల్లిలో సోమవారం స్థానిక ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్-2 ఆర్టీసీ డిపో అధికారులు దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 50 మంది దివ్యాంగులు డీలక్స్ బస్ సర్వీసుల్లో ప్రయాణించేందుకు వీలుగా ఆర్టీసీ అధికారుల సహకారంతో బస్‌పాసులు అందించినట్లు ఎంపీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి శివరాజ్‌తో పాటు స్థానికులు మహేశ్, నరహరి, భానుచందర్, కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేనా?

- నిధుల లేమితో నిలిచిన ఎంపీడీఓ భవన నిర్మాణం
- అద్దె భవనంలో, అరకొర వసతులతో నిర్వహణ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



స్లాబ్‌కే పరిమితమైన ఎంపీడీఓ కార్యాలయ భవనం

కడ్తాల్: మండలాలు, జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలంగా ఏర్పడటంతో పాటు రంగారెడ్డి జిల్లాలో కలిసిన కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రజల ఆకాంక్ష మేరకు నూతన మండలంగా ఏర్పడిన కడ్తాల్‌లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడంలేదని సర్వత్రా విమర్శలు వినపడుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి 2023 ఏడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా నిధుల లేమితో గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ వరకే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం 8 సంవత్సరాల నుంచి అద్దెభవనంలో అరకొర వసతుల మధ్య అనేక ఇక్కట్ల మధ్య కొనసాగుతోంది. కేవలం 5-6 గదులు ఉన్న భవనంలోనే ఈజీఎస్ కార్యాలయ పనులతో పాటు మండల పరిషత్ కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కూడా సరైన భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులో నిర్వహించాల్సిన పరిస్థితి. త్వరగా నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు. అలాగే మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చే ప్రజాప్రతినిధులతో పాటు, ప్రజలకు కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేవు. త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు, కడ్తాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లా



ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణ పనుల విషయమై స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లాను. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నూతన భవనం పూర్తయితే అధికారులు, ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది.

– కమ్లీమోత్యానాయక్, ఎంపీపీ, కడ్తాల్

ప్రతిపాదనలు పంపాం



ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి అప్పట్లో మంజూరైన నిధుల మేరకు పనులు చేపట్టారు. తదుపరి నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. అదనపు నిధుల గురించి ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

చిరస్మరణీయుడు సుందరయ్య

ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

తలకొండపల్లి: దళితుల హక్కులు, స్త్రీల సమానత్వం, పేదల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు పుచ్చపల్లి సుందరయ్య అని ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె.వెంకటేశ్వర్లు కొనియాడారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌లో సీపీఎం నాయకులు, కామ్రేడ్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఎంప్లాయీస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు జగన్ ముఖ్య అతిథులుగా హాజరై సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడుఆంజనేయులు, అంబేద్కర్, పూలే జాతర కమిటీ నాయకులు సుధాకర్, కేవీపీఎస్ జిల్లా నాయకులు చెన్నయ్య, జగన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కిషోర్, డీవైఎఫ్ఐ ఆమనగల్లు ఏరియా కమిటీ కార్యదర్శి శివశంకర్, ఎల్బీనగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు అరుణ్ కుమార్, సీపీఎం నాయకులు శ్రీనివాసులు, వెంకటయ్య, ఎంటయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాలను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమతంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ వ్యాప్తంగా పాత, శిథిలావస్థ గృహాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్లు, వీధుల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఈ భార్గవ్‌రెడ్డి, టీపీఎస్ వెంకట రఘునాథ్, మల్లేశ్, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు



రైతులకు జనుము విత్తనాలు అందజేస్తున్న ఏఓ శ్రీలత

మండల వ్యవసాయాధికారి శ్రీలత

కడ్తాల్: మండల కేంద్రంలోని అగ్రి రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని అగ్రి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెంపొందుతుందని, పంట దిగుబడిలో పచ్చిరొట్ట ప్రధాన భూమిక పోషిస్తుందని సూచించారు. వర్షాకాలంలో రైతుల కోసం 60% సబ్సిడీతో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము విత్తనాలు ఎకరాకు 12కేజీల నుంచి 15 కేజీల విత్తనాలను పొలంలో ఒత్తుగా చల్లుకుని, 30 నుంచి 45 రోజుల మధ్య పూత దశలో ఉన్నప్పుడు దుక్కిని కలియదున్నడం ద్వారా 10 నుంచి 12 టన్నుల పచ్చిరొట్ట లభ్యమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యసాయ శాఖ అధికారులు, అగ్రిసేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

వర్షానికి కూలిన ప్రహరీ, స్తంభాలు



వర్షానికి కూలిన ప్రహరీ, విద్యుత్ స్తంభాలు

ఆమనగల్లు: ఆమనగల్ పట్టణంలో సోమవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి పట్టణంలోని జాతీయ రహదారి జలమయంగా మారింది. పలు కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. విద్యానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మారుతి కారు షోరూం ప్రహరీ వర్షానికి కూలింది. ప్రహరీకి అనుకొని ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. కాగా ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నిరసన గళం

మంచాల మండల పరిధిలోని జాపాలలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు తమకు రోజు 300 రూపాయల కూలీ పడాల్సి ఉన్నప్పటికీ రూ.80 రూపాయలు మాత్రమే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జాపాల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తమకు రావాల్సిన డబ్బులు ఇచ్చేంతవరకు ఉపాధి పనులు చేయమంటూ స్పష్టం చేశారు.

- మంచాల



నిబంధనలు పాటించాలి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



ఉపాధి కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఉపాధి పనుల్లో నింబంధనలు పాటిస్తేనే కూలీ గిట్టుబాటు అవుతుందని.. సమయం వృథా చేసుకోకుండా పనులు చేయాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఉపాధి కూలీలకు సూచించారు. యాచారంలో సోమవారం ఆయన ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కూలీలు నింబంధనల మేరకు ఉపాధి పనులు చేయాలని సూచించారు. కూలీలు ప్రారంభించే సమయం, ముగించే సమయాల్లో ఖచ్చితంగా ఫోటోలు తీసి ఉంచాలని సిబ్బందికి సూచించారు. పనులు చేసిన వెంటనే పేస్లిప్పులు అడగాలని, వేతనాల్లో జాప్యం జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని గ్రామాల్లో గుంతలు సిద్ధం చేసి ఉంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ మన్నెగూడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవి వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్నెగూడ కాలనీ, ఎస్ఎస్ఆర్ కాలనీ, ప్రముఖ్ టౌన్‌షిప్, ఎంఎం.కుంట, సాయి టౌన్‌షిప్, హెవెన్స్ కార్నర్, మై హోమ్స్, వెంకటాద్రి టౌన్‌షిప్, మధ్యాహ్నం 3గంటల నుంచి లక్ష్మీ మెగాటౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, కుంట సాయిరెడ్డి కాలనీలో సరఫరా నిలిపివేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో....

సప్తగిరి ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తొర్రూర్ నుంచి కొహెడ రోడ్డు, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, కొహెడ నుంచి పెద్ద అంబర్‌పేట రోడ్డు, ఉప్పరిగూడ గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3గంటల నుంచి బాలాజీ నగర్ ఫీడర్ పరిధిలోని మిథానీకాలనీ, ఇంజాపూర్, దుర్గా నగర్, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి నుంచి సాగర్ రహదారి వరకు సరఫరాకు అంతరాయం కలుగనుంది.

'రాధాకృష్ణ' సేవలు ప్రశంసనీయం

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

కడ్తాల్: మండల పరిధిలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అన్నదాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అద్భుతమని ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్‌ను ఆయన అభినందించారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు, నాయకులతో కలిసి అన్నదాన కేంద్రంలో వారు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ జ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు శేఖర్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీను, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: వ్యవసాయశాఖ అధికారులు సమయపాలన పాటించడంతో పాటు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందించాలని సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు రైతులు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తాను కలిసి వ్యవసాయశాఖ అధికారుల సమయపాలన పాటించడంలేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. వివిధ పనుల నిమిత్తం వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లగా అధికారులు సమయానికి రావడం లేదని దీంతో వెనుతిరిగి రావాల్సి వస్తోందని తెలిపారు. ప్రస్తుత యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో పాటు, ప్రతి గింజను కొంటామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రతి గింజను కొంటామని అధికారులు చెబుతున్నా ఇక్కడ అమలు జరగడం లేదని వరి ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలిస్తే, మండల వ్యవసాయ శాఖ అధికారుల నుంచి టోకెన్ రాయించుకుని తీసుకురావాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది సూచిస్తున్నారని, తీరా వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్తే వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనుముల కోసం వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్తే అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా స్పందించి.. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలతను ఫోన్లో సంప్రదించగా క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండల కేంద్రం, మండల పరిధిలోని రావిచేడ్‌లో ఫర్టిలైజర్ దుకాణాల పరిశీలనలో ఉన్నానని.. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈఓ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు!

- వరుస వర్షాలతో దుక్కులు దున్నుతున్న అన్నదాతలు
- వాతావరణశాఖ సూచన మేరకు సాగుకు సన్నద్ధం
- భూసార పరీక్షలు, విత్తన ఎంపిక ప్రధానమంటున్న వ్యవసాయాధికారులు



మహేశ్వరంలో వేసవి దుక్కులు దున్నిన రైతు

మహేశ్వరం: గతకొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్నదాతలు దుక్కులు దున్నుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ సూచనల మేరకు సాగు పనులు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. తొలకరికి నెల ముందు సాగుకు సన్నద్ధమైతే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. సాగు ఖర్చు అంచనా రూపొందించుకోవాలంటున్నారు. సాగు విస్తీర్ణం మేరకు విత్తనాలు, కూలీలు, ఎరువులు కొనుగోలు వ్యయాన్ని సమకూర్చుకుంటే ఇబ్బందులుండవన్నారు.

వేసవి దుక్కులు కీలకం

వర్షాకాలం సాగుకు ముందు నుంచి పొలాలను చదును చేసుకోవాలి. తొలకరికి ముందే విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడపురుగులను నివారించవచ్చు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కి దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం ద్వారా మంచి దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది.

మూడు రకాలు..

వేసవి దుక్కులను లోతుగా, వాలుకు, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వలన వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. అవి భూసారవృద్ధికి తోడ్పడుతాయి.

పత్తి, వరి మొదళ్లను భూమిలో కలపడం

ప్రతి సంవత్సరం పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి మొదళ్లను కోసి తగులబెడుతుంటారు. పత్తి మొదళ్లు వృథా పోకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వలన భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువులు వాడకం తగ్గించవచ్చు. అలాగే వరిపంటను కోసిన తర్వాత వరి మొదళ్లను భూమిలో కలిపేసి దున్నాలి.

సేంద్రియ ఎరువుల వాడకం

సేంద్రియ ఎరువులు నేలలోకెళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్ల, గొర్రెలు, మేకల, వానపాముల ఎరువులను ఎకరానికి సుమారు 2-4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20-25 రోజుల ముందే సేంద్రియ పదార్థం వాడటం వలన భూమి గట్టి పడకుండా వదులుగా ఉంటుంది.

విత్తనోత్పత్తితో మేలు..

సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. పలు రకాల కంపెనీల విత్తనాలు మార్కెట్లో అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేల ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతుంది. ప్రతి సంవత్సరం ఏదో ఒక కంపెనీ విత్తనాలను వేసుకునేకంటే నాణ్యమైన విత్తనాలను రైతులే విత్తనోత్పత్తికి తోడ్పడితే మేలు.

భూసార పరీక్షలు చేయించాలి



భూమిలో ఎంతవరకు సారం ఉందని తెలుసుకునేందుకు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలి. అధిక దిగుబడికి పోటీపడి నష్టాలు కొని తెచ్చుకోవడం కంటే రైతులు భూసార పరీక్షలు చేయించి విలువలు తెలుసుకొని కాలానుగుణంగా సాగుతీరు మార్చుకోవడం వలన మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇసుక నేలలు, ఒండ్రు, రేగడి, బంకమట్టి, నీరు నిలిచే తదితర నేలలకు అనుగుణంగా విత్తనం విత్తుకోవడంతో ఆశించిన దిగుబడి సాధించవచ్చు. రైతులు మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించాలి.

– సుజాత, ఏడీఏ, మహేశ్వరం